www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 1 అక్టోబర్ 2025

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతి

పాలకోడేరు : మండలంలో ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు ఆశ్రియ్య డిమాండ్ చేశారు. పాలకోడేరు రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యాన మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రియ్య మాట్లాడుతూ పాలకోడేరు, మోగల్లు, విస్సాకోడేరు, శృంగవృక్షం గ్రామాల్లో 40 ఏళ్ల నుంచి ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్నా నేటికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయలేదని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జిఒ ప్రకారం నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందించిన వారిలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి క్రాంతి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామానుజా దాసు, వెంకటేష్, వెంకటరమణ, లక్ష్మి, వరలక్ష్మి, అన్నపూర్ణ ఉన్నారు.

డాలర్ పంట ధమాల్

- కుదేలైన ఆక్వా రంగం
- పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేక రైతులు లబోదిబో

ఆచంటలో ఆక్వా చెరువులు

ప్రజాశక్తి - ఆచంట

పెరిగిపోయిన పెట్టుబడులు, భూముల లీజులు, మరోపక్క దిగజారుతున్న ధరలు, చుట్టుముడుతున్న వైరస్‌లు ఆక్వా రైతులపై ముప్పేట దాడి చేస్తున్నాయి.టీ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల మోతతో కనీసం పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేక రైతులు లబోదిబోమంటున్నారు. సుంకాల భారం చూపి ఎగుమతిదారులు, కంపెనీలు రొయ్యల ధరలను అమాంతం తగ్గించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో సుమారు 1200 ఎకరాల్లో వనామీ రొయ్యల సాగు అధికంగా ఉంది.

మరో రెండు నెలల్లో పంట చేతికి

మరో రెండు నెలల్లో రైతుల చేతికి పంట వస్తుంది. ఈ తరుణంలో అమెరికా సుంకాల దెబ్బ ఆ సమయంలో ఏస్థాయిలో ఉంటుందోననే ఆందోళన రైతుల్లో నెలకొంది. ప్రస్తుతం 100 కౌంట్ ధర రూ.240 వరకు ఉందని రైతులు చెబుతున్నారు. అయితే పంట చేతికొచ్చే సమయానికి ఇది రూ.200కు దిగజారే ప్రమాదం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో రైతులకు పెట్టుబడులు రాని పరిస్థితి తప్పదని ఆందోళన చెందుతున్నారు. టైగర్ రొయ్య 20 కౌంట్ ధర నెల రోజుల క్రితం రూ.680 ఉండగా ప్రస్తుతం రూ.570కి తగ్గింది. ఈ లెక్కన నెల రోజుల్లో వనామీ ధర రూ.45, టైగర్ ధర రూ.100కుపైగా తగ్గింది.

డాలర్ పంట ధమాల్

15 ఏళ్ల కిందట వరకు రొయ్యల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించేవారు. ఎకరం చెరువులో 30 నుంచి 40 వేలు వరకూ సీడ్ వేసేవారు. ఏరియేటర్లు, డీజిల్ ఇంజిన్లు వినియోగించేవారు. మేత ధర టన్ను రూ.30 వేల నుంచి రూ.40 వేల మధ్య ఉండేది. లీజు ఎకరాకు రూ.20 నుంచి రూ.40 వేల మధ్యలో ఉండేది. వ్యాధుల బెడద తక్కువగా ఉండేది. దీంతో సులభంగా 30 నుంచి 40 వరకు కౌంట్‌కు వచ్చేవి. అప్పట్లో 40 కౌంట్ ధర రూ.400 వరకు ఉండటంతో రైతులకు లాభాల పంట పండేది. ప్రస్తుతం ఎకరానికి 1.50 లక్షల పిల్లలను చెరువులో వదులుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ బిల్లులు అధికంగా ఉంటున్నాయి. ఒక టన్ను మేత ధర రూ.80 వేలకు చేరింది. చెరువుల్లో వదిలే రొయ్య పిల్లల సంఖ్య మూడు రెట్లకు పెరగడంతో అదే రీతిలో మేత వేయాల్సి వస్తుంది. దీంతో ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక వ్యాధుల సంగతైతే చెప్పనవసరం లేదు.

ఎకరాకు రూ.లక్షపైనే నష్టం

రొయ్యల ఉత్పత్తి బాగా ఉంటే ఎకరానికి రెండు టన్నుల దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం సగటున ఎకరానికి 1.50 టన్నులకు మించి దిగుబడి రావడం లేదు. ఈ లెక్కన ఉన్న ధరతో ఎకరాకు రూ.3.50 లక్షలకు మించి రాబడి ఉండటం లేదు. దీంతో ఎకరాకు సొంత రైతుకు రూ.లక్షకు తగ్గకుండా, కౌలు రైతుకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తుంది.

ఆక్వాను వ్యవసాయ రంగంగా గుర్తించాలి

బాలం లీలా సుబ్రహ్మణ్యం, ఆక్వా రైతు, ఆచంట

ప్రస్తుతం ఆక్వా రంగం కష్టకాలం లో ఉంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంం కాలు విధించడం దారుణం. ఆక్వాను వ్యవసా య రంగంగా గుర్తించాలి. మార్కెట్ ఒడిదు డుకులతో నష్టపోతున్నాం. పెట్టుబడులు, ఖర్చులు పెరగడం, రొయ్యల ధరలు దిగజారడంతో నష్టాల బారిన పడుతున్నాం. పెట్టుబడులకు తెచ్చిన అప్పులకు వడ్డీలకు చాలడం లేదు.

సాగు వదిలేసే పరిస్థితులొస్తున్నాయి

ఇళ్ల గణపతి, ఆక్వా రైతు, పాలకొల్లు

ఆక్వా సాగు చేస్తున్న కౌలు రైతులకు విద్యుత్ రొయ్యల మేత వాటిపై సబ్సిడీ పెంచాలి. రొయ్యలు కొనుగోలు, ఫీడ్ తయారీ, హేచరీ కంపెనీలు వివిధ రాజకీయ నేతల కను సన్నల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వం వారితోనే చర్చలు, సంప్రదింపులు జరిపి సామాన్య రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తోందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఫీడ్‌కు సంబంధించి ముడి సరుకుల ధరలు తగ్గినా ఫీడ్ ధర కంపె నీలు తగ్గించకపోవడంతో అప్పుల పాలవుతున్నాం. ఎకరం రొయ్య ల సాగుకు రూ.నాలుగు లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చవు తుంది. ఈ క్రమంలో వ్యాధులు, సుంకాల బాదుడుతో ధర దిగజార డం వంటి కారణాల రీత్యా సాగు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

మళ్లీ పెరుగుతున్న గోదావరి

ప్రజాశక్తి - ఆచంట

ఏలూరు జిల్లాలోని పట్టిసీమ వద్ద గోదావరి ఉధృతి

లంక గ్రామాల ప్రజల్లో మళ్లీ గోదావరి వరద గుబులు మొదలైంది. ఎగువ నుంచి వస్తున్న వరద క్రమేపీ లంక భూముల్లోకి చేరుతుంది. ఏటిగట్టు దిగువనున్న భీమలాపురం శివారు కాపులపాలేన్ని ఏ క్షణమైనా వరద చుట్టుముట్టే అవకాశం ఉంది. వరద ఉధృతి పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మండలంలో పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం పుష్కర రేవులు నీట మునిగాయి. భీమలాపురం, కరుగోరుమిల్లి భూముల్లో కొబ్బరి, కూరగాయ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అయోధ్యలంక, పుచ్చల్లంక, రాయిలంక ప్రాంతాల్లో తమలపాకు, మునగ, బెండ, బీర, వంటి పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే కోతకు వస్తున్న సమయంలో మరోసారి గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో లంక గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు.

యలమంచిలి: గోదావరి వరద ఉధృతి మంగళవారం సాయంత్రానికి మరింత పెరిగింది. దీంతో లంక గ్రామాలైన కనకాయలంక, పెదలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, కంచుస్తంభంపాలెం తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలకు భారీగా వరద నీరు చేరింది. కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి మరింత పెరగడంతో పడవల రాకపోకలను కట్టుదిట్టం చేశారు.

నరసాపురం: నరసాపురం-సఖినేటిపల్లి రేవుల మధ్య గోదావరిపై పంటు రాకపోకలు మూడో రోజు మంగళవారం కూడా నిలిచిపోయాయి. గోదావరి వరద ఉధృతి కారణంగా ప్రయాణికుల భద్రత దృష్ట్యా అధికారులు ఆదివారం నుండి వశిష్టగోదావరిపై రాకపోకలు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు చించినాడ వారధి గుండా కోనసీమ జిల్లా చేరుకోవాల్సి వస్తుంది.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల పట్టాలివ్వాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

మాట్లాడుతున్న బి.బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వ స్థలాల్లో ఎన్నోఏళ్ల నుంచి నివాసముంటున్న అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. పాలకోడేరు ఎఎస్‌ఆర్ నగర్ ప్రాంతవాసులను మంగళవారం ఆయన పరామర్శించి మాట్లాడారు. ఇల్లు కూల్చివేసినా వారికి ఇప్పటి వరకూ ప్రత్యామ్నాయం చూపకపోవడం దారుణమన్నారు. కొంతమందికి పట్టాలు మంజూరు చేసినప్పటికీ వారి ఆర్థిక స్తోమత సరిపోక ఇల్లు నిర్మించుకోలేదన్నారు. అసలు ఇళ్ల పట్టాలు అందని అర్హులు ఎంతోమంది ఉన్నారని, వారందరికీ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేలా కూటమి ప్రభుత్వం జిఒ జారీ చేసిందని, దాని ప్రకారం ఇళ్ల పట్టాలు అందించాలని కోరారు. బలరాం వెంట సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, నాయకులు దున్న మరియమ్మ, గోపాలరాజు ఉన్నారు.

నిత్యావసరాల...

ధరలు తగ్గితే ఒట్టు..!

సామాన్య ప్రజానీకానికి

దక్కని జిఎస్‌టి తగ్గింపు ఊరట

పప్పులు, వంటనూనె వంటి

నిత్యావసరాల ధరలు భగభగ

ఆహార ఉత్పత్తుల ధరలు

తగ్గకపోవడంపై జనంలో చర్చ

సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్

నినాదంపై విమర్శలు

ధరల మోతతో దసరా పండుగకు

సామాన్యులు దూరం

సూపర్ జిఎస్‌టి..సూపర్ సేవింగ్స్ అంటూ ప్రభుత్వం విడుదల చేసిన పోస్టర్



సెప్టెంబర్ 29న ధరల పట్టిక

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్'. 'మహిళల అభ్యున్నతికి సాకారం.. సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం' అంటూ ప్రభుత్వం విడుదల చేసిన పోస్టర్లు, ప్రచారంపై సామాన్య ప్రజానీకం పెదవి విరుస్తున్నారు. ప్రజలు నిత్యం ఉపయోగించే నిత్యావసరాల ధరలు తగ్గించకుండా సామాన్య ప్రజానీకానికి ఏవిధంగా సూపర్ గిఫ్ట్ అందినట్లని ప్రశ్నిస్తున్నారు. జిఎస్‌టి 2.0 అంటూ కేంద్ర ప్రభుత్వం పన్నుల శ్లాబుల్లో మార్పులు చేసింది. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చింది. జిఎస్‌టి తగ్గింపుతో సామాన్యుల బతుకుల్లో పెనుమార్పులు వస్తాయని పాలకులు తెగ ఊదరగొడుతున్నారు. దీనికోసం ప్రత్యేకంగా ప్రచార ఆర్భాట కార్యక్రమాలు నిర్వహిస్తూ అధికార యంత్రాంగాన్ని మొత్తం పరుగులు పెట్టిస్తున్నారు. జనాలు మాత్రం జిఎస్‌టి 2.0పై పెదవి విరుస్తున్నారు. కార్లు, టీవీల వంటి వాటి ధరలు తగ్గడం వల్ల సామాన్యులకు ఏవిధమైన ఉపయోగం ఉండదని, నెలవారీ సంపాదనల్లో అత్యధిక భాగం ఖర్చుపెట్టే నిత్యావసరాల ధరలు తగ్గినప్పుడే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 40 లక్షల జనాభా ఉన్నారు. దీనిలో 80 శాతం సామాన్య ప్రజానీకమే. వ్యవసాయ కూలీలు, అవు ట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, దుకాణాల్లో పని చేసేవారు, చిరు వ్యాపారులే అత్యధికంగా ఉన్నారు. నెలవారీ సంపాదనలో అత్యధికంగా నిత్యం వాడే ఆహార ఉత్పత్తులకే జనం ఖర్చు పెడతారు. ఖరీదైన కార్లు, టీవీలు వంటివి సామాన్యులు కొనుగోలు చేయడం ఉండదు. జిఎస్‌టి 2.0 సంస్కరణలు అమల్లోకి వచ్చినప్పటికీ నిత్యావసరాల ధరల్లో ఏమాత్రం మార్పు లేదు. గతంలో మాదిరిగానే కందిపప్పు ధర వంద నుంచి రూ.120 పలుకుతోంది. మినపప్పు కిలో రూ.105 ఉండగా, ఎండుమిర్చి రూ.180గా ఉంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ రూ.126 ఉండగా, విజయ ఆయిల్ రూ.150 పలుకుతోంది. పెసరపప్పు కిలో రూ.120, వేపుడు శెనగపప్పు కిలో రూ.110గా ఉంది. వెల్లుల్లి ధర కిలో రూ.200 ఉండగా, అన్ని రకాల నిత్యావసరాల ధరలు భగభగమంటూ మండుతూనే ఉన్నాయి. ఆగస్టు నెలలో ఏవిధమైన ధరలున్నాయో ఇప్పటికీ అవే ధరలు ఉన్నాయి. దీంతో ధరలు ఎక్కడా తగ్గాయని సామాన్య ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు. పాలు, ఔషధాలపై జిఎస్‌టి తగ్గించినా వ్యాపారులు హెచ్చుధరలకే విక్రయిస్తున్నారు. దీంతో సామాన్య ప్రజానీకం ప్రభుత్వం చెబుతున్న మాటలపై పెదవి విరుస్తోంది.

సామాన్యులు దసరా పండుగకు దూరం

నిత్యావసరాల ధరలు ఏమాత్రం తగ్గకపోవడంతో సామాన్య ప్రజానీకం దసరా పండుగను సంతోషంగా జరుపుకోలేని పరిస్థితి నెలకొంది. దసరాకు పిండివంటలు వంటివి ప్రత్యేకంగా చేస్తారు. వంటనూనె, పప్పుల ధరలు భారీగా ఉండటంతో సామాన్య ప్రజానీకం పిండి వంటలకు దూరంగా ఉంటున్నారు. చిన్నపాటి పిండి వంట చేయాలన్నా రూ.వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సామాన్యుల ఇళ్లలో పిండి వంటలు కానరాని పరిస్థితి నెలకొంది. నెలకు రూ.15 వేలు సంపాదించే చిరుద్యోగి సైతం ఇంట్లో ఉపయోగించే నిత్యావసరాలకు నెలకు రూ.పది వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. నిత్యావసరాల ధరలు తగ్గితే సామాన్యులకు ఊరట లభించేది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం చెబుతున్న మాటలపై సామాన్య ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ

కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు ద్వారా జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. మంత్రి శ్రీనివాస వర్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, ఉద్యాన, పౌరసరఫరాలు తదితర శాఖల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ జిల్లాలో జెజెఎం కింద రూ.1,735 కోట్లు అంచనా వ్యయంతో 1,489 పనులు మంజూరు చేశామన్నారు. వీటిలో రూ.1,400 కోట్లను వాటర్‌గ్రిడ్ ఏర్పాటుకు కేటాయించామని, దీనికి అవసరమైన స్థల సేకరణను విజ్జేశ్వరంలో పరిశీలిస్తున్నామని తెలిపారు. శాఖలవారీ ప్రగతిని సంబంధిత అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. పిఎసి ఛైర్మన్ రామాంజనేయులు మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందని, దీనికి రూ.36 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారని తెలిపారు. తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ రోడ్లపై గుంతలు పూడ్చడంతో ప్రయోజనం లేదని, మందపాటి సింగిల్ లేయర్ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్‌పై ప్రచార ప్రక్రియను వివరించారు. అనంతరం ఆ కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణరెడ్డి, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, ఆర్‌డిఒ దాసి రాజు, డిపిఒ ఎం.రామనాథరెడ్డి, సిపిఒ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ఒ జి.గీతాబాయి, డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, జిల్లా హౌసింగ్ అధికారి జి.పిచ్చయ్య, ఎల్‌డిఎం నాగేంద్రప్రసాద్, ఆర్అండ్‌బి ఎస్ఇ ఎ.శ్రీనివాస్, జిల్లా లేబర్ ఆఫీసర్ ఎ.లక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు కె.రామచంద్రారెడ్డి, ఏసుబాబు, టి.రామకుమార్, బి.విజయసారథి, ఎం.అంజయ్య, జి.కృష్ణమోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దుర్మార్గం

వైసిపి ఆధ్వర్యాన మార్టేరులో అంబేద్కర్ విగ్రహానికి వినతి

నరసాపురంలో అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా

ప్రజాశక్తి - పెనుమంట్ర

జగనన్న ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలు కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరించడాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆచంట అసెంబ్లీ నియోజకవర్గ ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం మార్టేరు సెంటర్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర మహిళా నాయకురాలు, జెడ్ పిటిసి కర్రి గౌరి సుభాషిణి మాట్లాడుతూ దళిత, బడుగు, బలహీన, మైనారిటీ తరగతులకు, అగ్రవర్ణ నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య అందడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇష్టంలేక వైద్య విద్య దూరం చేశారని తీవ్రంగా ఆరోపించారు. నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షులు పిల్లి రుద్రప్రసాద్ మాట్లాడుతూ కేవలం దళిత విద్యార్థులకు అన్యాయం చేసే విధంగా చంద్రబాబు ప్రభుత్వం దళిత వ్యతిరేక విధానాలు అవ లంభిస్తుందని విమ ర్శించారు. గత వైసిపి హయాంలో అన్ని తరగతులకు సమన్యాయం చేసేలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పరిపాలన కొనసాగించిన ఏకైక నేత మాజీ ముఖ్యమంత్రి జగన్ ఒక్కరే అని అన్నారు. రెడ్ బుక్ పేరుతో అరాచకాలు సృష్టిస్తూ వైసిపి నాయకులపై అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో వైసిపి నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, మండలంలోని మార్టేరు, మాముడూరు తదితర గ్రామాలకు చెందిన సర్పంచులు మట్టా కుమారీ రాము, గూడూరి దేవేంద్రుడు, జక్కంశెట్టి చంటి, జక్కంశెట్టి శ్రీరామ్ పాల్గొన్నారు.



మార్టేరులో అంబేద్కర్ విగ్రహానికి వినతి అందజేస్తున్న నేతలు

నరసాపురం : కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నరసాపురం అంబేద్కర్ సెంటర్లో మంగళవారం వైసిపి ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. మూడుసార్లు సిఎంగా చేసిన చంద్రబాబు నాయుడు ఒక్క మెడికల్ కాలేజ్ తీసుకురాలేదని నేతలు అన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జగన్ 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారని.. వాటిని ఈ ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మైలాబత్తుల సోని, పీడి రాజు, పడవల సత్యనారాయణ, కొల్లాబత్తుల రవి పాల్గొన్నారు.



నరసాపురంలో ధర్నా చేస్తున్న నేతలు

ఆన్‌లైన్ పనులు నిలిపేస్తున్నాం

డిఆర్‌డిఎ పీడీకి విఒఎల సంఘం లేఖ అందజేత

డిఆర్‌డిఎ పీడీకి లేఖ అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

5జి సెల్‌ఫోన్లు ఇచ్చేవరకు ఆన్‌లైన్ పనులు నిలుపుదల చేస్తున్నట్లు విఒఎల సంఘం జిల్లా కమిటీ ప్రకటించింది. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ పనులు నిలిపివేస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు గోవిందమ్మ, సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు తెలిపారు. దీనిలో భాగంగా స్థానిక కలెక్టరేట్లో డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పలుసార్లు విఒఎల సమస్యలపై వినతిపత్రాలు, రాయబారాలు అన్ని స్థాయిల్లోనూ అందించామన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు వాటిని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దుర్గాదేవి, హబీబా, హేమకుమారి, కన్యాకుమారి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆలమూరులో కమ్యునిటీ హాల్‌కు శంకుస్థాపన

పెనుమంట్ర : జిఎస్‌టి ఫలాలు ప్రతి ఇంటికీ అందించాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశ్యమని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఉదయం మండలంలోని ఆలమూరులో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న వెలమ, శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబుల్ ఇంజన్ సర్కార్ వేగంగా అభివృద్ధి, సంక్షేమాన్ని నిర్వహిస్తున్నాయని అన్నారు. నిత్య జీవితంలో ప్రజలు కొనుగోలు చేసే వస్తువులపై జిఎస్‌టిని కొంత తగ్గించడం, కొన్నిటిలో దానిని పూర్తిగా తొలగించడం జరిగిందని, దీని కారణంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. శెట్టిబలిజ రామాలయంలో ఎంఎల్ఎ పితాని, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మేడపరెడ్డి వెంకటరమణ, ఎంపిటిసి పలివెల ఆశాలత ప్రేమ్‌కుమార్, టిడిపి నాయకులు కడలి ఏడుకొండలు, నూర్ సాహెబ్ దూదేకుల రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ అలీ జిన్నా, మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, టిడిపి మండల కార్యదర్శి గూడూరి మురళీ, జనసేన మండల అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, నీటిసంఘం అధ్యక్షులు ఇందుకూరి నరసింహారాజు, కర్రి అయ్యప్పరెడ్డి, తేతల రామారెడ్డి, గుర్రి పరమేశ్వరరావు, సూరెడ్డి దుర్గాప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎంఎల్ఎ పితాని

5న ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా మహాసభ

సంఘం జిల్లా అధ్యక్షులు టివిఎస్.మూర్తి

తణుకు : ఆర్‌టిసి, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా మహాసభలు ఈనెల 5వ తేదీన తణుకులో జరుగుతాయని జిల్లా అధ్యక్షులు టివిఎస్.మూర్తి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మహాసభల్లో కార్మికుల సమస్యలపై చర్చిస్తామని, 12వ వేతన కమిటీ వేయలేదని, ఐఆర్ ప్రకటించలేదని, నాలుగు డిఎ పెండింగ్‌లు ఉన్నాయని, డిఎ అలవెన్స్ వేయలేదని అన్నారు. గత సంవత్సర కాలంలో రిటైర్డ్ అయిన వారికి గ్రాడ్యూటీ కూడా చెల్లించలేదని, ఐదు సంవత్సరాలు లీవ్ అండ్ ఎన్కేష్మెంట్స్ పెండింగ్‌లో పెట్టారని, పలు సమస్యలపై చర్చిస్తామని అన్నారు. మహిళా ఫ్రీ బస్సు ట్రావెల్‌పై ఎస్‌డబ్ల్యూఎఫ్ 5 రాష్ట్రాల్లో సర్వే చేసి రిపోర్ట్ ప్రభుత్వానికి అందజేశామని, ఆర్‌టిసి సంస్థపైన, ఉద్యోగ భద్రతపై చర్చిస్తామని, మెరుగైన వైద్యసౌకర్యాల సాధనకు, ప్రమోషన్స్ రిక్రూట్‌మెంట్లు, కొత్త బస్సులు కొనుగోలుకే ఆర్‌టిసిలో ఉన్న సంఘాల్ని ఐక్యంగా పోరాటాలు చేయుటకు, ఐక్యం చేయుటకు కృషి చేస్తామన్నారు. ఈ మహాసభకు 250 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. మహాసభలను జయప్రదం చేయుటకు కార్మికులు కృషిచేయాలని తెలిపారు. యూనియన్ తణుకు డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షులు కె.నూకరాజు, కార్యదర్శి ఎన్.శ్రీనివాసు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

కప్పు మనదే పోస్టర్ ఆవిష్కరణ

టీమిండియా పోరాట స్ఫూర్తి అమోఘం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆసియా కప్ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై టీమిండియా అద్భుత విజయం సాధించిందని, ఈ చారిత్రక గెలుపుతో క్రీడాభిమానులు దేశవ్యాప్తంగా సంబరాలు చేసుకుంటున్నారని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో పట్టణ మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యాన మంగళవారం కప్పు మనదే పోస్టర్‌ను ఆవిష్కరించారు. టీమిండియా పోరాట స్ఫూర్తి, నైపుణ్యం, సంయమనం ప్రదర్శించిందని, ఒక్క ఓటమి కూడా లేకుండా ఛాంపియన్‌లుగా నిలిచిందన్నారు. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన తిలక్ వర్మకు అభినందనలని, ప్రతి భారతీయుడికి ఇది గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

నేడు ట్రాక్టర్ల ర్యాలీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వం ప్రకటించిన జిఎస్‌టి అమలుపై అవగాహన కోసం బుధవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ర్యాలీ జరుగుతుందని ఎంఎఒ బి.దేవీ స్వరూప ఇక్కడ తెలిపారు. ఈ కార్యక్రమం మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ మధ్యాహ్నం 3.30కి ఆలమూరు గ్రామంలో ప్రారంభిస్తారని ఆమె పేర్కొన్నారు.

సిఎం సహాయనిధి పేదల పాలిట వరం

విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

సిఎం సహాయనిధి పేదల పాలిట వరమని ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మంగళవారం నరసాపురం జనసేన కార్యాలయంలో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ, ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని పలువురికి రూ.1,23,106 చెక్కులు అందజేశారు.

పలుచోట్ల సూపర్ 'జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని నవాబుపాలెం గ్రామంలో మంగళవారం సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం.వెంకటేష్ మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తిస్థాయిలో జిఎస్‌టి తగ్గుదల ద్వారా వచ్చే సేవింగ్స్‌పై అవగాహన కల్పించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ జిఎస్‌టి తగ్గుదల అంశాన్ని అవగాహన కల్పించాలని సూచించారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఆ దిశగా ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలు అందించడంతోపాటు నిత్యావసర ధరలు జిఎస్‌టి ద్వారా తగ్గించడం అభినందనీయమన్నారు. కార్యదర్శి జి.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, అంగన్వాడీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం : మండలంలోని చిట్టవరం గ్రామంలో సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. గ్రామంలో పలు నిత్యావసర షాపులను సందర్శించి, షాపు యాజమాన్యంతో పాటు కొనుగోలు దారులతో జిఎస్‌టి రేట్ల వివరాలు, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, నరసాపురం పట్టణ అధ్యక్షులు, ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, గ్రామ అధ్యక్షులు కొప్పిరెడ్డి నాగు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి

ప్రజాశక్తి - తణుకు

తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులకు సకాలంలో చికిత్స అందించడంతోపాటు జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోకుండా అధికారులను ఎంఎల్ఎ రాధాకృష్ణ సమన్వయం చేసిన ఘటన మంగళవారం తణుకులో చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు ప్రమాదానికి గురయ్యారు. ఇదే సమయంలో అటుగా వెళుతున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ ఆగి అంబులెన్స్ వాహనం వచ్చే వరకు అక్కడే ఉండి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సకాలంలో చికిత్స అందించడంతోపాటు రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోకుండా అధికారులను అప్రమత్తం చేశారు. సమాజానికి ఉపయోగపడేలా సేవ చేయడం, అనుకోని ప్రమాదం లేదా అన్యాయం జరిగినప్పుడు తక్షణమే సాటి మనిషిగా అండగా నిలిచిన ఎంఎల్ఎ రాధాకృష్ణ తీరును పలువురు ప్రసంశించారు.

కొప్పర్రులో ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - నరసాపురం



పూజలు చేస్తున్న పోలిశెట్టి శ్రీనివాస్ దంపతులు

మండలంలోని కొప్పర్రు గ్రామంలోని చిన్న వీధిలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజైన మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్, సునీత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేడు శ్రీరామేశ్వరస్వామి పాలకమండలి ప్రమాణ స్వీకారం

ఆచంట : ఆచంట శ్రీరామేశ్వర స్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఉదయం 9 గంటల 30 నిమిషాలకు జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆదిమూల వెంకట సత్యనారాయణ మంగళవారం విలేకరులకు తెలిపారు. నూతన పాలకమండలి ఛైర్మన్‌గా ఆచంట గ్రామానికి చెందిన నెక్కంటి గజేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండల ప్రజలు, యాత్రికులు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

5వ తేదీ వరకూ పోలీస్ యాక్ట్ అమలు : డిఎస్‌పి

నరసాపురం : నరసాపురం సబ్ డివిజన్‌లో పోలీసులు ఆంక్షలు విధించారు. శాంతి భద్రతల దృష్ట్యా సబ్ డివిజన్ అంతటా పోలీస్ యాక్ట్ 30ని అమలు చేస్తున్నారు. ఈనెల 20 నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకూ సబ్ డివిజన్ అంతా అమల్లో ఉన్నట్లు డిఎస్‌పి జి.శ్రీవేద వెల్లడించారు. ముందస్తు అనుమతి లేకుండా సబ్ డివిజన్‌లో ఎలాంటి బహిరంగ సమావేశాలు గానీ, ఊరేగింపులు, ధర్నాలు గానీ జరపకూడదని తెలిపారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరాలకు పురిగొల్పే ఆయుధాలను వాడకూడదన్నారు. భారీగా జనసమూహాన్ని పోగుచేసే సమావేశాలు, లౌడ్ స్పీకర్లు, డీజేలపై కూడా నిషేధం ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని తెలిపారు. అందరూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా చర్యలకు సహకరించాలని డిఎస్‌పి తెలిపారు.

లారీ డ్రైవర్‌పై కేసు

నరసాపురం : అంబేద్కర్ సెంటర్లో సోమవారం రాత్రి లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి కారులను ఢీకొట్టింది. స్థానికుల వివరాల ప్రకారం నరసాపురం నుండి మొగల్తూరుకి లోడుతో వెళ్తున్న లారీ ఎత్తు ప్రాంతంలో వంతెన ఎక్కలేక అదుపుతప్పి వెనకకు వచ్చింది. ఈ ప్రమాదంలో టాక్సీ స్టాండ్‌లో పెట్టిన రెండు కారులు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంతో జనం ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. ఎవరికీ గాయాలు కాకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.కారు డ్రైవర్ సిహెచ్.మోహన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ బి.యాదగిరి తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

లక్ష్మీ నరసింహపురంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

పారిశుధ్యం అధ్వానం..

పట్టించుకోని అధికారులు, పాలకులు

రోగాల నుంచి రక్షించాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - కాళ్ల

అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో లక్ష్మీనరసింహపురం(ఎల్ఎన్ పురం) గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీ, వర్షపు, మురికినీరు రోడ్ల మీద ప్రవహిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం విశేషం. ఈ పంచాయతీలో అపారిశుధ్యం నెలకొంది. పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా ఉన్న అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, ప్రవహించని మురుగు కాల్వలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహించడంతో నానాటికి సమస్య తీవ్రమవుతుంది. శెట్టిబలిజ రామాలయం, పాఠశాలకు వెళ్లే రోడ్డు, పంచాయతీకి ఎదురుగా ఉన్న రోడ్డు, సగర్ల పేట రామాలయం, మంచినీటి ట్యాంక్ రోడ్డు, అరుంధతి ప్రాంతానికి వెళ్లే రోడ్డుల్లో వర్షపు, మురుగు నీరు నిలిచిపోతుంది. డ్రెయినేజీలో పూడిక తీయకపోవడం వల్ల మురుగునీరు ప్రవహించక దోమల విజృంభణతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. బ్లీచింగ్ పౌడర్‌ను సైతం పిచికారీ చేయడం లేదు. అయితే ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. ప్రజలు మాత్రం డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు పదే పదే చెబుతున్నారు. పారిశుధ్య లోపాన్ని పక్కన పెట్టి పంచాయతీ నిధులతో వివిధ పనులు చేస్తున్నారు. అయితే పారిశుధ్య పనులు మాత్రమే పంచాయతీలో చేపట్టడం లేదు. ఇప్పటికైనా గ్రామంలో పారిశుధ్యం, మురుగుకాల్వల పూడికతీత పనులు చేపట్టాలని, ప్రజలను అనారోగ్యం బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై కార్యదర్శిని వివరణ కోసం ఫోన్ చేస్తే స్పందించలేదు.

పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి

మైలా శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచి, ఎల్ఎన్ పురం

పారిశుధ్య సమస్యను తక్షణమే పరిష్కరించి సీజనల్ వ్యాధులను నివారించాలి. పంట కాలువలోకి చెత్తను యధేచ్ఛగా పడేస్తున్నా పట్టించుకోవడం లేదు. పంట కాలువగట్టుపై ఉన్న చెత్తను తొలగించడం లేదు. రోడ్డు వెంబడి డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇళ్లలోకి మురికి నీరు పంట కాలువలోకి వదిలేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.

సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి

వ్యకాస జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ



రమేష్‌బాబు

పీడిత ప్రజల ఉద్యమ ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య తన సొంత గ్రామంలో అప్పట్లో కూలీలను తవ్వల కొలతలతో ఎలా దోపిడీ చేసేవారో దానిని గ్రహించి మొదటగా తన ఇంట్లోనే వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించారని, అది ఈరోజున దేశమంతా వ్యాపించి కోట్ల మంది సభ్యత్వం కలిగిన సంఘంగా ముందుకెళుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఐదవ మండల మహాసభ తాడేపల్లిగూడెం రూరల్‌లోని నవాబుపాలెం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ మహాసభకు ముందుగా సంఘం జెండాను సీనియర్ నాయకులు కొండపల్లి గణేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం అనేక స్థానిక సమస్యలు, ఉపాధి కూలీలు, ఇళ్ల స్థలాలు, భూ సమస్యల మీద అలుపెరగని పోరాటం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రానున్న కాలంలో ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడం కోసం మరిన్ని పోరాటాలు చేయాల్సి ఉందని ఆయన అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ఉపాధి పెండింగుల బకాయిల కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఈ కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసిందని ఆ ఉద్యమాల ఫలితంగానే 18 సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధి బకాయిలు పడిపోయాయని, వాటిని రప్పించడం కోసం వ్యవసాయ కార్మిక సంఘం నిర్విరామంగా కృషి చేసిందన్నారు. సంఘం మండల కార్యదర్శి కండెల్లి రమేష్ బాబు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల కాలంలో సంఘం చేసిన కార్యకలాపాల రిపోర్టు వినిపించారు. అనంతరం 9 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మాగంటి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా పీలాగాధ నాయుడు, కార్యదర్శిగా కండెల్లి రమేష్ బాబు, సహాయ కార్యదర్శిగా ఈదా పెద్దింట్లు, కమిటీ సభ్యులుగా కండెల్లి బాబురావు, గజ్జరపు వెంకటేశ్వరరావు, పాల్‌పూరి శ్రీనివాసు, గోపాల వెంకటరావు, నూతంగి సూర్యారావు ఎన్నికయ్యారు.

నవుడూరు సెంటర్లో ఆర్‌టిసి స్టేజీ ఏర్పాటు చేయాలి

ఆర్‌టిసి ఆర్ఎం వరప్రసాద్‌కు సర్పంచి, ఎంపిటిసి వినతి

ప్రజాశక్తి - భీమవరం

అనేక గ్రామాలకు కేంద్రంగా ఉన్న నవుడూరు సెంటర్‌లో ఆర్‌టిసి స్టేజ్ ఏర్పాటు చేయాలని నవుడూరు గ్రామ సర్పంచి నల్లమిల్లి వేణుక, ఎంపిటిసి యాళ్లబండి ఇందిర ఆర్‌టిసి ఆర్ఎం ఎన్‌విఆర్.వరప్రసాద్ ను కోరారు. స్థానిక భీమవరం ఆర్‌టిసి డిపో కార్యాలయంలో ఆర్ఎం వరప్రసాద్‌కు నవుడూరు సెంటర్లో ఆర్‌టిసి స్టేజ్ ఏర్పాటు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన ప్రజల నుండి సంతకాలు సేకరించి మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమవరం నుండి రాజమండ్రి వెళ్లే బస్సు ఎక్కితే టికెట్ పై పొలమూరు ఉంటుందని, అదే రాజమండ్రి నుండి భీమవరం వచ్చే టికెట్‌పై పంజా వేమవరం అని ఉంటుందని దీనివల్ల నవుడూరు సెంటర్లో ఎక్కి, దిగే ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజల ప్రయోజనార్థం నవుడూరు సెంటర్లో స్టేజ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌టిసి ఆర్ఎం ఎన్‌విఆర్.వరప్రసాద్ మాట్లాడుతూ కిలోమీటర్ల వ్యవధిని సర్వే చేసి స్టేజ్ ఏర్పాటు చేయడానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిపిఎం నాయకులు లింగం సత్యనారాయణ, యాళ్లబండి మారియ్య నాయుడు, గ్రామ పెద్దలు యాళ్ల బండి బాబి, నల్లమిల్లి శ్రీనివాస్ ఉన్నారు.

తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

మైక్రో ఫిల్టర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రారంభిస్తున్న రఘురామకృష్ణరాజు

బొండాడపేట గ్రామప్రజల తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం ఏర్పడిందని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. బొండాడ పేట గ్రామంలో రూ.9.72 లక్షలతో నిర్మించిన మైక్రో వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. బొండాడపేట మైనర్ గ్రామ పంచాయతీలో 0.5 ఎంఎల్‌టి సామర్థ్యం గల మైక్రో ఫిల్టర్ ప్లాంట్‌ను మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు, కెనరా బ్యాంక్ నిధులు రూ.4.72 లక్షలతో నిర్మించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ చాలా ఏళ్లుగా తాగునీటి సమస్యతో బాధపడుతున్న గ్రామానికి ఇప్పుడు ఊపిరి పీల్చుకునే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో కెనరా బ్యాంక్ ఆధ్వర్యాన 25 మైక్రో ఫిల్టర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు సహకారం అందిస్తుందన్నారు. జలజీవన్ మిషన్ నిధులు, కెనరా బ్యాంక్, తన స్నేహితులు, ఎంపీ నిధులతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కనుమూరు భరత్, గ్రామ సర్పంచి గుడ్ల వీరవెంకట మధుసూదనరావు, గ్రామ కార్యదర్శి కె.మణికంఠ, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాధరాజు, జెడ్‌పిటిసి పి.సోమేశ్వరరావు, ఎంపిటిసి గుత్తికొండ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాసరావు, ఎఇ అమీరపు ఫణి, టిడిపి మండల అధ్యక్షులు అరేటి వెంకట రత్నప్రసాద్, ఉండి, ఆకివీడు డిసి ఛైర్మన్‌లు తోట ఫణిబాబు, గోకరాజు శివబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌డిఒ దాసి రాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - నరసాపురం

చిన్నారులతో ఆర్‌డిఒ దాసిరాజు

మండలంలోని సీతారామపురం గ్రామం యానాదుల కాలనీలోని కమ్యూనిటీ భవనంలో చిన్నారుల సమక్షంలో రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. బర్త్ డే కేకును కట్ చేసి అందరికి పంచారు. విద్యా సామగ్రితో పాటు స్వీట్లను ఆర్‌డిఒ దాసిరాజు అందజేసి కొద్దిసేపు ముచ్చటించారు. గులాబీ పువ్వులను ఆర్‌డిఒకు చిన్నారులు అందజేసి జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేఖ, విఆర్ఒలు కె.సత్తిబాబు, కె.నాగేంద్ర, కృష్ణ భగవాన్, గుత్తుల వాసు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు రూ.2,785 కోట్లు తిరిగి ఇవ్వాలి : సిపిఎం

వీరవాసరం : టిడిపి కూటమి ప్రభుత్వం మాట తప్పి అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలోనే రూ.15485.36 కోట్లు ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం వేసిందని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి తీవ్రంగా విమర్శించారు. సిపిఎం కార్యకర్తల సమావేశం యండమూరి సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం వీరవాసరం సిపిఎం మండల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ ఛార్జీలు పెంచిందని, చంద్రబాబు ప్రభుత్వానికి ఎపిఇఆర్‌సి గట్టి షాకు ఇచ్చిందన్నారు. ప్రజల నుండి వసూలు చేసిన విద్యుత్ ఛార్జీలు సుమారు వెయ్యి కోట్ల రుపాయాలను ప్రజలకు తిరిగి ఇచ్చేయాలని ఆదేశించడం ఈ ప్రభుత్వానికి గుణపాఠం అన్నారు. ఇందన సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రతీ యూనిట్‌కు 40 పైసలు చొప్పున ముందుగానే రూ.2,758 కోట్లు వినియోగదారుల నుండి అన్యాయంగా వసూలు చేసిన సొమ్మును కూడా వినియోగదారులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరెంటు ఛార్జీలు తగ్గిస్తామని చంద్రబాబు చెప్పడమంటే ప్రజలను ఎప్పుడు ఎలా మోసం చేయాలో ఆయనకు బాగా తెలుసన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో చంద్రబాబు సిఎంగా ఉండగా ఒక నియంతలా విద్యుత్ ఛార్జీలు పెంచగా దానిని వ్యతిరేకిస్తూ చేసిన పోరాటంలో ముగ్గురు ప్రాణాలు తీశారని, దాని ఫలితంగా 15 సంవత్సరాలు చంద్రబాబును ప్రజలు అధికారంలోకి రాకుండా చేసారంటూ గుర్తుచేశారు. ఇదేవిధంగా జిఎస్‌టి వేలకోట్లు తగ్గించామంటూ కేంద్ర ప్రభుత్వం ఊదరకొట్టడం తొందరలో ఎనిమిది రాష్ట్రాలలో ఎన్నికలు జరగబోతున్నందువల్లే ఓట్ల కోసం మోడీ ప్రభుత్వం జిఎస్‌టి తగ్గించారు తప్ప ప్రజల మీద ప్రేమ కాదన్నారు. ఇంత వరకు ప్రజల నుండి వసూలు చేసిన మొత్తం జిఎస్‌టిని తిరిగి ఇవ్వవచ్చు కదా అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదే పనిగా వారి ప్రచార సాధనాల ద్వారా జిఎస్‌టి తగ్గించామని, ప్రజలకు మేలు చేస్తున్నామని చెప్పే బదులు జిఎస్‌టిని రద్దు చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ బొర్రా ఆలమహారాజు, యాళ్లబండి నారాయణమూర్తి, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది : ఎంఎల్ఎ

భీమవరం టౌన్ : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం ఎంతో గొప్పదని, దైవ కార్యక్రమాల్లో అన్న సమారాధనలు భగవంతుడు మెచ్చే కార్యక్రమమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. మండలంలోని రాయలం గ్రామంలో 3వ వార్షిక శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవంలో భాగంగా మంగళవారం రాయలం గణేష్ యూత్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని మహా నివేదనకు హారతులు ఇచ్చారు. వందలాది మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో టౌన్ హాల్ అధ్యక్షులు కోళ్ల రామచంద్రరావు, యూత్ సభ్యులు రామదుర్గ, పవన్, కేశవ, నందు, గౌతమ్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. 345/2010
Between:
శ్రీమతి వారణాసి వెంకట సూర్యప్రభ మరియు వగైరాలు -వాదులు
AND
శ్రీమతి మలాది భానుమతి మరియు వగైరాలు -ప్రతివాదులు
D-11 / 11వ ప్రతివాది: ద్వారా వెంకట శ్రీనివాస్, S/o. లేటు సత్యనారాయణ, పురుషుడు, 54 సం।।లు, ఎంప్లాయి, వాడపల్లి గ్రామం, కొవ్వూరు మండలం.
D-12 / 12వ ప్రతివాది: ద్వారా వెంకటరత్నం, S/o. లేటు సత్యనారాయణ, ఫ్లాట్ నెం.204, వెంకటేశ్వరా కాలనీ, నెల్లూరు, నెల్లూరు జిల్లా.
D-13 / 13వ ప్రతివాది: నీలం నారాయణమ్మ, W/o. శ్రీనివాస్, డో.నెం. 4-17/30, మిలటరీ కాలనీ, తాడేపల్లిగూడెం, ప.గో।।జిల్లా.
ప్రకటన
పై నెంబరు దావా నందు ప్రతివాదులు అయిన D11, D12, D13 అయిన మీకు ఎన్నిసార్లు రిజిష్టర్డు పోస్టు ద్వారాను, కోర్టు వారి ద్వారాను దావా సమన్సు పంపించినప్పటికి మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకముగా రిటర్న్ చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఈ ప్రకటన ద్వారా D11, D12, D13 ప్రతివాదులు అయిన మీరు **ది. 10-10-2025వ తేదీన ఉదయం 10.30 ని।।**లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, వకీలు ద్వారాగా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేయగలరు. అట్లు కాని పక్షమున మీ పరోక్షమున తీర్మానించబడును.
ఎన్.వి.సుబ్బారావు
కొవ్వూరు అడ్వకేట్, కొవ్వూరు
ది.22-9-25 సెల్: 9440330449

మునిసిపల్ ఆఫీసు, పాలకొల్లు
ఆర్.ఓ.సి. నెం. 598/2025/ఇ1 ది.29-09-2025
ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు
పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని వివిధ వార్డులలో పురపాలక సంఘ సాధారణ నిధులతో - 2 పనులు చేపట్టుటకు గాను అంచనాలు విలువ సుమారు రూ. 36,65,000/-లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా షార్టు టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది. 01-10-2025 వ తేది సాయంత్రం గం।। 4.00 ని।।ల నుండి లభించును.
బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేదీ : 01-10-2025 సాయంత్రం గం. 04.00 ని.లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ ముగింపు తేదీ : 08-10-2025 సాయంత్రం గం. 04.00 ని.లకు
ప్రైస్ బిడ్ తెరుచు తేదీ : 08-10-2025 సాయంత్రం గం. 04.30 ని.లకు
మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.
కమిషనరు,
పాలకొల్లు పురపాలక సంఘం.

బాధితులకు న్యాయం చేసేందుకే వైసిపి డిజిటల్ బుక్

మాజీ డిప్యూటీ సిఎం కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపుతో వేధింపులకు, అన్యాయాలకు గురైన వారికి న్యాయం చేసేందుకే వైసిపి డిజిటల్ బుక్ ను పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చారని తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అన్యాయంగా, అక్రమంగా తప్పుడు కేసులు బనాయించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలను సైతం ఈ ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తుందని ఆయన ధ్వజమెత్తారు. పార్టీ శ్రేణులతో పాటు సామాన్య ప్రజలు సైతం కూటమి ప్రభుత్వంలో ఎటువంటి అన్యాయాలు, అక్రమాలు, వేధింపులకు గురైన ఈ డిజిటల్ బుక్‌లో ఫిర్యాదు నమోదు చేయవచ్చునన్నారు. వీటన్నింటినీ నిక్షిప్తం చేసి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తగిన న్యాయం చేస్తుందన్నారు. ఏ పోలీసు అధికారి అయిన, ఏ ప్రభుత్వ శాఖ అధికారి అయిన అన్యాయంగా, అకారణంగా వేధింపులకు గురిచేస్తే వారు ఎక్కడ ఉన్నా పట్టుకుని తీసుకువచ్చి బాధితులకు తగిన న్యాయం చేయడం జరుగుతుందని తెలియజేశారు. వైఎస్.జగన్ మోహన్ రెడ్డి 2.0లో భాగంగా ఈ డిజిటల్ బుక్‌ను రూపొందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ బిఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ఈ కూటమి ప్రభుత్వం ఉల్లంఘిస్తుందని ఆరోపించారు. వైసిపి రూపొందించిన డిజిటల్ బుక్ ముందు లోకేష్ రెడ్ బుక్ ఎందుకూ సరిపోదన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ముప్పిడి సంపత్ కుమార్, కొలుకులూరి ధర్మరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది
ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, గుడిపాడు గ్రామానికి చెందిన ముప్వల రాంబాబు అను నేను నా యొక్క పాస్‌పోర్ట్ పడిపోయింది. ది. 15-08-2025 తేదిన గుడిపాడు-నాయుడుగూడెం బైక్ పై వెళుచుండగా మార్గమధ్యలో పడిపోయింది. పాస్‌పోర్ట్ నెంబర్: **P5216895** ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్ కు అందజేయగలరు.
నా సెల్ నెం: 89850 27773

మహారాజశ్రీ 3వ అదనపు (మొబైల్) జూనియర్ సివిల్ జడ్జి ఏలూరు
ఓ.యస్. నెం: 122/2023
బిట్వీన్:
కొండు నిర్మలకుమారి ...వాది
మరియు
కేదారి H.V. సూర్యశ్రీకాంత్ మరియొకరు ...ప్రతివాదులు
వాది దాఖలు చేసిన పబ్లికేషన్
పై నెంబరు గల దావాలో 2వ ప్రతివాది అయిన కేదారి లీలాగాయత్రి D/o. కేదారి కొండలరావు, D.No: 30-12-22, పంపులచెరువు రోడ్డు, పడమరవీధి, వంగాయగూడెం, ఏలూరు, ఏలూరు జిల్లా వారికి పై కోర్టులో **ది. 07-10-2025 సం।। తేదీన ఉదయం గం. 10-30 ని।।లకు** వాయిదా అయి ఉన్నది. సదరు ప్రతివాది స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు దావా తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.
ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు అడ్వకేట్స్, ఏలూరు
ది.30-09-2025 ఏలూరు జిల్లా
సెల్: 99890 89289

వేలం ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు నందు
ఇ.పి. నెం: 69/2018 ఇన్ ఓ.యస్. నెం: 258/2018
బళ్ల అనంతలక్ష్మి ...వాది/డిక్రీ హూల్డర్
ఎదిరి
పాము శ్రీధర్ ...ప్రతివాది/జడ్జిమెంట్ డేటార్
పై నెంబరు దావాలోని డిక్రీ ప్రకారం పై డిక్రీ హూల్డర్ పై నెంబరు వారంటు అమలు గ్రంధమును ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తిని కోర్టు ద్వారా బహిరంగముగా వేలం వేయించి సదరు డిక్రీ బాకీ వసూలు చేయించి ఇప్పించ గలందులకు కోర్టు వారిని కోరుచూ దాఖలు చేసియున్నారు. అందుపై పై కోర్టు వారు ఈ ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తిని కోర్టు ద్వారా **ది. 23-10-2025 సం।। తేదిన** పై కోర్టు వారి ఎదుట **ఉదయం గం. 10-30 ని.ల నుండి** బహిరంగముగా వేలం వేయించుటకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున కావలసినవారు పాల్గొని పాడుకొనవచ్చును.
వేలపు ఆస్తి వివరము
పశ్చిమగోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, మొగల్తూరు సబ్ రిజిష్ట్రీ లోని, మొగల్తూరు గ్రామంలోని రి.స.నెం. 722/1, క్రొత్త రి.స.నెం. 722/1ఎ1, లో
ఐటం 1: అసెస్మెంట్ నెం. 233, తలుపు నెం. 3-3, గల 156 చ.గజముల స్థలం అందలి గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ ఫ్లోరు గల ఆర్.సి.సి భవనమునకు హద్దులు:
తూర్పు - గ్రంధి వారికి పువ్వాడ వారికి చెందిన ఉమ్మడి దారి మార్గం
దక్షిణం - పువ్వాడ వెంకటేశ్వరరావు వగైరాల గోడ
పడమర - మాతంగి పేటకు వెళ్ళు దారి
ఉత్తరం - గ్రంధి సత్యవతి గారి ఇల్లు స్థలం
156 చ.గజముల స్థలం అందలి గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ ఫ్లోర్ గల ఆర్.సి.సి. భవనము అందలి అంటి యున్న గృహోపకరణములు మరియు యావత్తు ఈజిమెంట్ హక్కులతో సహా.
ఐటం 2: అసెస్మెంట్ నెం. 283, తలుపు నెం. 3-60, గల 139 చ.గజముల స్థలం అందలి గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ ఫ్లోరు గల ఆర్.సి.సి భవనమునకు హద్దులు:
తూర్పు - గ్రంధి వెంకటేశ్వరరావు గారి స్థలం
దక్షిణం - అనంతపల్లి వారి సరిహద్దు గోడ
పడమర - పాము జ్యోతిశ్రీ గారి ఆస్తి
ఉత్తరం - హైవే రోడ్డు మార్జిన్
139 చ.గజముల స్థలం అందలి గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ ఫ్లోర్ గల ఆర్.సి.సి. భవనము అందలి అంటి యున్న గృహోపకరణములు మరియు యావత్తు ఈజిమెంట్ హక్కులతో సహా.
డిక్రీహోల్డర్ విలువ ఐటం 1 : Rs. 10,00,000/-
ఐటం 2 : Rs. 10,00,000/-
అమీనా విలువ ఐటం 1 : Rs. 30,00,000/-
ఐటం 2 : Rs. 40,00,000/-
జడ్జిమెంట్ డేటార్ విలువ తెలియజేయలేదు.
సరిపల్లి రామ సత్తయ్య,
ఎం.ఎస్.ఎస్.వి. రమణ,
నర్సాపురం న్యాయవాదులు, నర్సాపురం
ది.30-09-2025 సెల్: 98488 37555